కథానిక

# వ్యర్థప్రయత్నం

యం. వై. రెడ్డి

'బాబుగోరూ, బీదోళ్ళం! కనికరించండి!" అందరి తరఫున వకాల్తా పుచ్చుకొని విన్నాపనమును నివేదించుకున్నాడు తిరుపతిరెడ్డి. "ఏమిట్రా, ఇప్పుడు తగలడ్డారు?" అసలు సంగతి తనకు తెలియనట్లు ముఖాకృతి మార్చి అన్నాడు కరణం శ్రీమాన్ అయ్యాజుల భద్ర వెంకట బంగారు మధుసూధనరావు పంతులుగారు.

వ్యవహార దక్షుడైన రామయ్య ('రామిరెడ్డి' అని ఏ చిన్నడైనా సంభోదించక పోయెనా, రామయ్య హుందాను, బహు హుందాగా ప్రదర్శించ గలడు) తిరుపతి రెడ్డిగారి అండనిలిచాడు. "స్వామీ బీదోళ్ళం! ఈ పొట్టకోసం ఇన్నితిప్పలు" అంటూ వెన్నెముకనంటి ఉన్న తన ఉదరాన్ని మిగతావారిలా నిమిరాడు. "నానా కట్టాలు పడుతున్నాం! తింటానికి తిండిలేదు!"

"అసలు సంగతి ఏమిటి? చంపుకు తినక కాస్త చెప్పుదురూ! వెధవలు, ఒక్కోడకీ నోరులేదు! ఊ...! చెప్పి చావరేం? అవతల నాకు భోజెడు పనుంది."

"అదే బాబూ! మీ చేతిక్రింది నీళ్లు తాగే వాళ్ళంకదూ! ఏదో మీదయ! మేము పదిమందిమీ సాగుచేసుకుంటున్న పరిమడి సంగతి! గోరుమెంటోళ్ళు బీదోళ్ళకు బంజరుభూము లిస్తారంటనే! అందుకనే మీదగ్గిర కొచ్చినం! మీరు గోరమెంటోళ్ళకి చెప్పండి; మీరు చెపితే వాళ్ళు వింటారుగా!" ఆ అమాయకులనుచూచి లోలోన నవ్వుకున్నాడు అ. భ. వేం బం. మ. సూ. రా. పంతులు.

"అంత సులభమనుకున్నారా, ఏం? కుటుంబానికి అర్ధ ఎకరా! ఆహాహా! ఏం అదృష్టంరా మీది!" రైతులందరికన్నా చిన్నవాడైనప్పటికినీ, కరణంగారు అటువంటి సంభోదనకే అలవాటు పడినాడు. "ఏదోలెండి? అయిదేళ్ళబట్టీ, నానాగడ్డితిని కట్టపడి పనిసేత్తున్నాం కదండీ! అందులో మాలో కుటుంబానికి అర్ధ ఎకరే కదండీ, ఇస్తూంట! అబ్బ! ఇంక మాకు దిగులు ఉండనే ఉండదండీ! హాయిగా పండించుకుంటాం! తింటాం! మా బుళ్లోళ్ళకి చొక్కాలు కుట్టిస్తాం! మీరు కాస్త గవరమెంటోళ్ళకి సెప్పండి! పని అయిపోయింది!" ప్రభుత్వం అంటే కరణంగారే అయినట్టు మాట్లాడారు నిష్కలంక హృదయాలతో అమాయికంగా.

"ఇది పై వాళ్ళతో పని! ముందు మీరు దరఖాస్తు జిల్లా కలెక్టరు దొరవారికి పంపుకోవాలి! ఆ మీదట రెవెన్యూ ఇన్స్పెక్టరుగారు (ఇన్స్పెక్టరుగారు లంచంలో తనకిచ్చేభాగాన్ని తలంచుకొనేటప్పటికి ఆయన మనస్సు మహదానందం పొందిందనుకోండి) తాసిల్దారు దొరవార్లు వచ్చి విచారణ చేసిపోతారు. తరువాత, బుద్ధిపుడితే ఆ పొలం మీకిస్తారు. పొండి. దరఖాస్తు పెట్టుకోండి" అంటూ భోజనానికి దారితీశాడు కరణం.

"దరఖాస్తు" అనేమాట తమ జీవితాల్లో విన్నటం వారికదే ప్రథమపర్యాయం. అలాంటప్పుడు దాని అర్థం వీరి కెలా తెలుస్తుంది! తెల్లమొఖాలు వేసి, మాసిన తెల్లని గడ్డములతో ఒకరినొకరు పరికించుకొన్నారు. అంతలో తిరుపతిరెడ్డిగారు అందుకున్నారు, "అదా, దరఖాస్తా! మొన్న ఎవరో అనుకుంటూంటే విన్నా! యేదో కాగితం రాసి, పైకి పంపాలట! అప్పుడు మనకు కావలసిన పని జరుగుద్దంట" "అట్టానా? పైకి అంటే గాలిలో యెయ్యాలనా? యేస్తే యెవరికి చేరుతుంది?" ఒక ముసలి రైతు తన అనుమానాన్ని తెలివితక్కువగా వెలిబుచ్చాడు. ఇంకొకరు అన్నారు "ఉండండిరా! మనకేం తెలుత్తది! సామిగారినే రానియ్యండి! ఆయనగారినే అడుగుదాం, ఆ కాయితం రాసియ్యమని."

ఒక గంట తరువాత కరణంవారు పెద్ద గుమ్మడికాయంత బొజ్జని నిమురుతూ, బుజ్జగిస్తూ, దక్షిణ హస్తంతో ఉదర పరిమాణాన్ని లెక్క కడుతూ వసారాలో కేతెంచి, దర్శనంకోసం మధ్యాహ్నపు

టెండలో, మలినాంబరధారులై, ఇంటిని తమ పాదధూళిచే పవిత్ర మొనరించే ప్రయత్నంచేయక మలమలమాడుతూ, నిరీక్షణ దృక్కులతో వేచి ఉన్న ఆ రైతుల నొక్కపరి వీక్షించి చిరు నవ్వులు వొలకబోస్తూ, తన ముఖాకృతిని మాత్రం అసహ్యంగా మార్చాడు.

"అబ్బ! మీతో చచ్చేకాలమొచ్చింది! ఇంకా కూర్చుని ఉన్నారేం? దరఖాస్తుకోసమా? నా చేత కాదు. పొండి...పొండి" పిరుదులను మాత్రమే ఆచ్ఛాదిత మొనరిస్తూ ఉన్న మలినవస్త్రాన్ని సాగదీస్తూ, వినయ విధేయతలతో తిరుపతిరెడ్డి అన్నాడు "స్వామిగోరు మన్నించాలి. మీకు ఏం చేయాలో అర్థంకావటం లేదు!"

"ఇదిగో చూడండి! ఇది చాలా కష్టం! ఎంతో కష్టపడితేగాని, ఈ పని గట్టెక్కదు. ముందు కలెక్టరుగారికి అర్జీ పెట్టుకోవాలి! సర్వే నెంబరు భూమికొలతా...ఇత్యాదులు చాలా లెక్కలు తీయాలి. అందుకుగాను పట్నం పోవాలి. ఎట్ట కాదన్నా పాతిక రూపాయలు ఖర్చవుతుంది. ఆ ఖర్చులు భరిస్తే, ఆ పని నేను చేసిపెడతాను. చూడండి. ఇందులో నాకు మిగిలేదేమీ వుండదు. పోగా, నా చేతివే రెండోమూడో ఖర్చవుతాయి. ఏదో మీకోసం, ఆమాత్రం ఖర్చుపెట్టగలనులే! బీదోళ్ళు...మా చేతికింద బతికేవాళ్ళు...మీకీ మాత్రం సాయం చేయకుంటే ఎట్లా!" కలియుగంలో ధర్మరాజు కరణంగా జన్మించాడని ఆ అమాయక రైతులు సంతోషించారు.

కాని వారిని ఒక అనుమానం బాధించింది. "ఇంత డబ్బు ఎక్కడినుంచి తేవాలి?" "సూక్ష్మ బుద్ధి" అయిన తిరుపతిరెడ్డి సలహా ఇచ్చాడు "అది కాదర్రా! మొన్న కూలీపనులవల్ల వచ్చిన డబ్బు ఉండలా! దాంట్లోనే తలా ఓ అయిదు పట్టుకు రండి. మనవి పది కుటుంబాలు. కుటుంబానికి అర్థ ఎకరా! మన తాతల కాలంలో కూడ ఆమాత్రం ఆస్థి ఉందా యేంటి మనకు? ఇప్పుడు మన పరిమడి నవిటి భూమిఅయినా అర్థ ఎకరా 800 రూపాయలు సేత్తది. పోతే పోయిందిలే డబ్బు. ఏం ఖర్చుపెట్టినా ఈసారే కదూ. ఇంతటితో పీడా విరగడై పోతుంది!"

కష్టఫలితంలో కొంతభాగం హరించుకుపోయింది. మరుసటి రోజు కరణంగారు అన్నారు "కావలసినవన్నీ సరిచేశాను! మీ బొటనవ్రేలి గుర్తులు వేసిపొండి చాలు. పని జరిగిపోతుంది" రైతుల ఆనందం పట్ట నలవిగాలేదు. అంత స్వల్ప కాలంలో, తమ కార్యాన్ని నెరవేర్చినందుకు కరణంగారిని కొనియాడారు. "కరణంగారు పట్ట ణాని కెప్పుడెళ్ళారు?" అనే అనుమానం వారి మనస్సులలో ప్రవేశించలేకపోయింది.

"ఒరేయ్! వెంకిగా! ఎక్కడ చచ్చావురా! పలకవేంరా! పొగరా, ఏం? గవర్నమెంటోళ్ళు ఇచ్చేడబ్బుతో లెస్సగా తిని, దున్నలా బలిసావ్!"

"ఆ! వత్తున్నానండీ! గోరమెంటోళ్లు నాకిచ్చేది ఎనిమిది రూపాయలేకదండి! ఎనిమిది రూపాయలతో పొట్ట ఎలాగడుత్తదండీ! ఎప్పుడూ మీ యింట్లోనే పని సెయ్యాల సొచ్చెనే!"

"అది కాదురా!ఇటుచూడు. నాకైతేమాత్రం గవర్నమెంటు ఎంత ఇస్తుందిరా! నేనుమాత్రం బలవలా!" "అవున్లెండి!" అంటూనవ్వాడు యెంకిగాడు. అరరే! యెంకిగాడేంటి! 'దనియాలు' తన మతమిచ్చిన పేరది! "ఏంపనో చెప్పండి దొరా! ఇకమీదట నన్ను దనియాలు అని పిలవండి!" "ధనియా లేంటిరా! మిరపగాయల్లా! నీ పేరు డేనియల్ రా!" "అదేంటోలే బాబూనన్ను ఎంకిగా, అని పిలవండి! నాకెందుకిదంతా."

"వొరేయ్! పోయి, బంజరు భూములకోసం దరఖాస్తుపెట్టిన వాళ్ళను పిలుచుకురా!" కట్టెబడి నిష్క్రమించాడు.

అంతలో ప్రజాసేవకుడు, ప్రజా సన్మాని తుడు అయిన వెంకటరామయ్య కరణం గారిని సమీపించాడు. అ.భ.వేం.బం.మ.సూ.రా. పంతులుగారు పడిన కంగారు అంతా—యింతా కాదు. భయంతో వణకుతూ అన్నాడు, "ఇటు రండి; కూర్చోండి! మీరు కాకితో కబురుపింపితే నేను మీ పాదాలదగ్గిర వాలేవాణ్ణి కదూ! మీరు వచ్చినపని..." తన పాదాలక్రింద భూమి కదలి పోతుందేమో అన్నట్లు, తనను తానే నిలవ ద్రొక్కుకుంటూ గొణిగాడు కరణం. "అబ్బే! మీరింకోలా అనుకోకండి! నిలబడ్డారేం!

కూర్చోండి! ఏదో పూర్వ పరిచయం ఉందికాబట్టి మీదర్శనం చేసుకుందామని వచ్చాను." "ఆ! ఆ! ఎంతమాటన్నారూ! మీరు వచ్చినపని ఈ సేవకుని చెవిలో పడవేస్తే!" "అదేలే! ఏదో చిన్నసంగతి!" "చెప్పండి! అనుమానిస్తారేం? మీకోసం నేనే పనైనా చేస్తాను." "అలా అనకండి! మీసంగతి నాకు తెలియనిదా! మీరు, నాకు ఎన్నికలలో చేసిన సహాయాన్ని ఎప్పుడైనా మరుస్తానా! నల్ల కాలువదగ్గర ఏదో అయిదు ఎకరాల బంజరు ఉందటగా! అదీగాక, దానిని ఎవరో సాగుచేశా రటగా? చేసినా, ఏంలే! దాని సర్వేనెంబరు, అదీ తెలుసుకుపోదామని!" "అవశ్యం! దానికి అభ్యం తరం ఏముందండీ! ఇప్పుడే చూసిపెడతాను. అయితే, ఒక సంగతండీ! ఆ బంజరుని సాగుచేసే రైతులు, ఆ భూమికోసం దరఖాస్తు పెట్టుకున్నా రండీ!" అనుమానం వెలిపుచ్చాడు కరణం.

"దానికేముందిలే! నేను రాజకీయ బాధి తుణ్ణిగా. 'నేనే ఆభూమికి అర్హుణ్ణి." "మీకు, మెట్ట అవుతేఏం, పల్లం అవుతేఏం, రెండొందల ఎకరాలుందికదా! మీకిస్తారుటండీ ఆభూమి!" "ఏం, అమాయకుడివయ్యా' నువ్వు! రాజకీయ బాధితుణ్ణి అనగానే ఇట్టే పారేస్తుంది ప్రభుత్వం ఆభూమిని ఏం? రెండొందల ఎకరాలేగా నాకు న్నది! అందులో నేను జైలుకు పోయిఉంటిని జైల్లో ఉన్న నెలరోజులు యమయాతన పడ్డానే! ఇదిగో, ఇలారా! (మెల్లిగా) నాకు మంత్రిదగ్గర కూడ ప్రాబల్యముందిలే!" "ఓహో! అట్టాగా!" అంటూ వెకిలినవ్వు ప్రదర్శించాడు కరణం. "రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ తనిఖీ కొస్తున్నాడు, ఈ బంజరు భూమినిగురించి భోగట్టా తీయటానికి!" "అదంతా నేను చూచుకుంటాలే!" అంటూ బయలుదేరాడు శాసనసభ్యుడు తన పని ముగించు కుని. బయట అడుగుపెట్టి, ఆతురతతో వస్తూన్న రైతులనుగాంచి, వికృతంగా నవ్వాడు. రైతులు చేతులు జోడించారు.

"స్వామీ, పైనుంచి కాయితం వొచ్చిందా" అంటూ రైతులు(దరఖాస్తుదారులు) ఆతురతతో ప్రశ్నించారు కరణంగారిని "ఓరి! మీ బండలుపడ! అప్పుడేమైంది! రెవెన్యూ ఇన్‌స్పెక్టరుగారు తనిఖీ కొస్తున్నాడు. రిపోర్టు పంపాలి. నేను రాసిన కాయితం ఇంతపని చేసింది! ఆయనకూడ రాసేస్తే మీపని గట్టెక్కినట్లే!" "రానియ్యండి. మాగోడవ చెప్పుకుంటాం! మా గోడవ యింటానికేగా ఆయ నొచ్చేది! ప్రభుత్వమోళ్ళు ఎంత ధర్మాత్ములు!" ఆశ్చర్యం వెలిబుచ్చారు దరఖాస్తుదారులు.

"ఇంత పెద్దవారయ్యారు; ఆ మాత్రం జ్ఞానమే లేదే! ఆయనగారు, మీచుట్టం అనుకున్నారా, ఏం, మీపని చేసిపెట్టటానికి?" "అయితే, ఏం మీకు తలా ఓ అర్ధ ఎకరా ఉచితంగా వస్తూంది కదూ! ఆయనచేసే మేలుకు మీరు ప్రతిఫలంగా ఏదో కొంచెం ముట్టచెప్పాలి! ఎకరాకు పదిరూపా యలు పట్టుకురండి! రేపు ప్రొద్దున తెచ్చివ్వండి నాకు ఆయనకిస్తాను...మన కార్యం కాస్తా గడచిపోతుంది..."

రైతులు తమ నిస్సహాయతను తెలుపలేదు. ఒక్క యేభైరూపాయలతో అయిదు ఎకరాలు తమపరం అవుతుందనే సంగతి వారిని మైమర పించింది.

మరుసటిరోజు రెవిన్యూ ఇన్‌స్పెక్టరుగారితో కరణంగారు మాట్లాతున్న సమయంలో, దరఖాస్తు దారులు తిరుపతిరెడ్డిని దళ నాయకుడిని గావించి ఆఫీసరుగారిని సమీపించారు. ఆ సమయంలో కరణంగారు అంటున్నారు "ఈ డబ్బు తీసుకోండి! ఏదో పాపం బీదవాళ్లు! దయ ఉంచండి" అంటూ పదిరూకలను రెవిన్యూ ఇనస్పెక్టరుగారి పాతకోటు క్రిందిజేబులో పదిలమొనరించాడు. "వీరినెందుకు దయతలచనూ...?" అంటున్నట్లు ముఖంపెట్టాడు ఆఫీసరు. ఇనస్పెక్టరుగారికి సంగతి సందర్భాలన్నీ తెలుసు. వెంకటరామయ్యగారి దరఖాస్తు సంగతీ తెలుసు. కాని నామకార్థంగా, ఈ తతంగమంతా జరిపిస్తున్నాడు. కరణంగారు ఆ ధనం ఇవ్వటం, రైతుల ఎడల తన నిజాయితీని నిరూపించుకోవటం కోసం. దూరాననుండి ఈ దృశ్యాన్ని తిలకించిన రైతులు కరణంగారి నిజాయితీని మెచ్చుకున్నారు.

ఇనస్పెక్టరుగారు దరఖాస్తుదారులవైపు తన ముఖమును త్రిప్పి, రంగువేసిన మీసాలను సవరిస్తూ అన్నాడు, "మీ సంగతి అంతా కరణంగారు చెప్పారు. మీకు ఆస్తి గీస్తీ ఏమీ లేదని నేను

తెలుసుకున్నాను. మీ యిండ్లు, మీ పరిస్థితులు చూడాలి పదండి" అంటూ దారితీశాడు దొర. రైతుల ఆనందం పట్టనశక్యమైంది. ఎంత దయార్ద్ర హృదయులు దొరవారు! బీదల కడగండ్లు పరిశీలించుటకు బయల్దేరాడు, ఆపద్ధర్మడు.

రైతుల గృహాలను పరిశీలించేటప్పటికి, నాలుగైదు కండబెట్టిన కోళ్ళు అధికారి సగర్వనేత్రములను ఆకర్షించాయి. వెంటనే అన్నాడు, "తాసిల్దారు వారు కోళ్లుకావాలన్నారు (తాసిల్దారు బ్రాహ్మణుడనే సంగతి రైతులకు తెలియదు) ఆయనకివి ఇవ్వండి; తీసుకెడతా!" "అయ్యా! మేము దేవతలకు మొక్కుకొన్నాం. వీటిని పోలేరమ్మకాడ కోయాలి! లేకుంటే దేవి..." "మీరు వేరేవాటిని పెంచుకోండి. మాకు పట్టణంలో మంచివి దొరకవు. వొరేయ్! గాలీబు (జవాను) ఆ కోళ్ళను పట్టుకోరా చూడండి, మీకు తప్పకుండా ఆ భూమి లభిస్తుంది" అంటూ తిరుగు పయనానికి సన్నద్ధుడయ్యాడు ఇనస్పెక్టరు.

తిరుపతిరెడ్డి తోటి దరఖాస్తు దారులతో అంటున్నాడు, "వీళ్ళంతా మన కొంపలు కూల్చటానికి పుట్టారు! ఆలోచించి సూత్తే యిల్లంతా కలసి మనల్ని మోసం చేస్తున్నట్లున్నారు! అసలీ పనంతా కరణమే చేసేది. లేకుంటే 'చూడు, ఈ భూమిమీదే! రెండురోజుల్లో పట్టా తెప్పిస్తాను' అంటాడా! లేకుంటే మొన్న ఆ దొరవచ్చె నే; మరల ఈ తాసిల్దారు దొర ఎందుకు? కరణం సగం డబ్బు కాజేస్తున్నట్లున్నాడు. తాసిల్దారు కియ్యటానికి మరల నల్భైరూపాయలు పట్టకరమ్మంటాడా? ఇదంతా సూత్తే..." వాక్యం పూర్తి చేయలేక పోయాడు తిరుపతిరెడ్డి, రామన్న తన అభిప్రాయం వెలిబుచ్చాడు "అయినా మనం చేసేదేముంది? అంతా భగమంతునిదయ! పోతే పోయిందిలే డబ్బు! నా దగ్గర ఉండేది అయిదు రూపాయలే! దాన్ని ఇప్పుడు తాసిల్దారు కియ్యాలన్నమాట మీరు కూడ గడ్డి–కంప తిని తీసుక రండి ఈసారికి ఎట్టనో ఒక విధంగా వారి మొఖాన కొడదాం పీడవదుల్తుంది!" అందరు ఆలోచనా నిమగ్నులయ్యారు.

"ఆలోచిస్తాం పొండి" అన్నాడు యిరవైఐదు రూపాయలను చూచుకుంటూ (మిగతావి కరణంగారి జేబులోనే ఉన్నాయనుకోండి.) రైతులు మామూలు ధోరణిలో తమ గొడవను నివేదించుకొన్నారు "సార్! దయవుంచండి! బీదోళ్ళం." దొరవారు పలుకను కూడ పలుకలేదు.

ఈ సంఘటన జరిగిన నెల రోజులకు రైతులందరూ (దరఖాస్తుదారులు) కరణంగారి పిలుపునందుకుని ఆయన దయాస్వరూపాన్ని సందర్శించ నేగారు. కరణంగారితో వెంకటరామయ్యగారు చిరునవ్వులతో ప్రసంగిస్తున్నారు! రైతులు వారిద్దరికీ వంగి వంగి సలాములు చేశారు, కరణం అన్నాడు, "ప్రభుత్వపోట్ల దరిద్రపు వెధవలు. మీ కష్టసంపాదన అంతా పశువుమాదిరి మేసి, ఆ తాసిల్దారు దొర మిమ్మలను మోసంచేశాడు. ఏంచేస్తాం?"

"బాబూ! మీరైనా కనికరించండి" అంటూ ప్రజాప్రతినిధికి తమనమస్కృతులు అందజేశారు. ప్రజాప్రతినిధి పయోముఖ విషకుంభం. అన్నాడు కదా, "నన్నేంచేయమంటారు? ప్రభుత్వమోట్లు వద్దంటున్నా, ఆ భూమిని అంటగట్టారు నాకు!" "ఆ" అన్నారు రైతులు నోళ్ళు పెద్ద గుహల్లా తెరచి 'అయితే, ఈ సంగతి మీకు తెలియదా?' అంటూ వికృతహాసం ప్రపంచంమీద విసిరాడు ప్రజాహితుడు.

ఆ రైతుల ఆశాసౌధాలు నేలమట్టమయ్యాయి. అందరి నేత్రముల ముందు తాము చెమటోడ్చి, రక్తదానంచేసి సాగుచేసిన భూమి రాక్షసిలా నాట్యమాడింది. తాము సంవత్సరం కష్టపడి సంపాదించిన డబ్బుతో భార్యాపిల్లలకు గుడ్డలు కుట్టించి రెండు సంవత్సరముల నుండి ఉపయోగంలోనున్న శిథిలాంబరాలను దూరముగా విసరివేయవచ్చని కనిన కలలన్నీ కలలుగానే ఉండిపోయాయి. ఆ విషాద దృశ్యాన్ని జ్ఞప్తికి తెచ్చుకోలేక, గుండెలు ఛిన్నాభిన్నమయ్యాయా అన్నట్లు కూలబడి పోయారు వ్యథిత హృదయాలతో ఆ బీద దరఖాస్తు దారులు. ప్రజాసేవకు లిద్దరూ ఆనంద బాష్పాలు రాల్చారు.